Eenadu

# రైల్వే పరీక్ష రాస్తే రుసుము వాపస్

**దిల్లీ:** ఇటీవల ప్రకటించిన రైల్వే ఉద్యోగాలకు పరీక్ష రుసుము పెంపును రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ సమర్థించుకున్నారు. పరీక్షలను ఆషామాషీగా తీసుకునే వారి సంఖ్యను తగ్గించేందుకు రుసుమును పెంచామన్నారు. దరఖాస్తుదారుల సంఖ్య అధికంగా ఉండటంతో పరీక్షల నిర్వహణకు చాలా వ్యయమవుతోందని అన్నారు. దీని దృష్ట్యా ఇదివరకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరంలేని వర్గాలకు రూ.250; రూ.100 చెల్లించాల్సిన వర్గాలకు రూ.500లుగా రుసుమును నిర్ణయించామన్నారు. ఈ రుసుముల భారాన్ని తగ్గించుకొనే మార్గాన్నీ మంత్రి వెల్లడించారు. రూ.250 రుసుముతో పరీక్షకు హాజరైన వారికి పూర్తి మొత్తాన్ని, రూ.500 చెల్లించి పరీక్ష రాసిన వారికి రూ.400 తిరిగి చెల్లించనున్నట్లు తెలిపారు. దీంతో పరీక్ష రుసుము పెంచినట్లు కాదని, పాత రుసుములనే అమలు చేసినట్లు అవుతుందని గోయల్ వివరించారు. రైల్వేల్లోని 90వేల పోస్టుల భర్తీకి ఇటీవల ప్రకటన జారీ అయిన విషయం తెలిసిందే.